క్లుప్తంగా

లింగాలలో నేడు చిన్నసరిగెత్తు


కొలువుదీరిన పీర్లు

నందికొట్కూరు: పాములపాడు మండల పరిధిలోని లింగాల గ్రామంలో పీర్ల పండుగ సందర్భంగా సోమవారం చిన్న సరిగెత్తు, మంగళవారం పెద్ద సరిగెత్తు నిర్వహిస్తున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం తెలియజేశారు. గ్రామంలో జరిగే పీర్ల పండుగకు తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారమని చెప్పారు.

వడ్డె ఓబన్న ఆశయ సాధనకు కృషి చేద్దాం


మాట్లాడుతున్న మంజుల బాలనరసింహుడు

నందికొట్కూరు: బ్రిటీషు పాలకులను గడగడలాడించిన వడ్డె ఓబన్న ఆశయ సాధనకు కృషి చేద్దామని అఖిల భారత వడ్డే ఓబన్న సేవా సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల బాలనరసింహుడు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఓ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర్ల హక్కుల కోసం పోరాడేందుకు యువత నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రామకృష్ణ, జిల్లా అధ్యక్షులు బీవీ‌స్‌రాజు, నాయకులు శివకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న వార్డు కౌన్సిలర్ హరిప్రసాద్

ఆత్మకూరు: పట్టణంలోని 23వ వార్డులో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు నూతన సీసీ రహదారి ఏర్పాటుకు వార్డు కౌన్సిలర్ హరిప్రసాద్ ఆదివారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రస్తుతం అంజనేయస్వామి గుడి నుంచి పుల్లయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో 2వ వార్డు కౌన్సిలర్ విజయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మారబోతులస్వామి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మకూరులో శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మణిపూర్‌లో గిరిజనులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆత్మకూరు పట్టణంలో క్రైస్తవ, దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, గిరిజన సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజనులపై దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాబిన్‌సన్, దరగ య్య, మాల మహానాడు నాయకులు మల్లయ్య, శీలం శేషు, ఇందిరానగర్, ఎస్పీజీ పాలెం ప్రార్థనా మందిరాల పాస్టర్లు రెవరెండ్ ఇషాక్‌బాబు, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతోనే రాజ్యాధికారం


సమావేశంలో మాట్లాడుతున్న బహుజన జేఏసీ కన్వీనర్ డాక్టర్ నాగన్న

నందికొట్కూరు: ఐక్యమత్యంతో పోరాడితే రాజ్యాధికారం బహుజనులదేనని జేఏసీ కన్వీనర్ డాక్టర్ నాగన్న అన్నారు. ఆదివారం పాములపాడు మండల కేంద్రంలోని అంబేడ్కర్ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించాలంటే రాజ్యాధికారం అవసరమన్నారు. ప్రస్తుత పాలకులు కుల, మతాలను రెచ్చగొట్టి బహుజనుల అభివృద్ధిని పతనం చేస్తున్నారని గుర్తు చేశారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల నాయకులు సంజీవరాయుడు, శంకర్‌గౌడు, షర్ఫుద్దీన్, శ్రీనివాసులు, నరసింహులు, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

నందికొట్కూరు: నేడు మున్సిపల్ అభివృద్ధిపై, సమస్యలపై సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కిషోర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ పరిధిలోని ఆయా శాఖల అధికారులు సమగ్ర నివేదికతో హాజరు కావాలన్నారు.

వృత్తిలో నిలదొక్కుకునేలా

- యువ న్యాయవాదులకు భరోసానిస్తున్న వైఎస్సార్ లా నేస్తం
- ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వం



నందికొట్కూరు: ప్రజా సంకల్పయాత్రలో న్యాయవాదుల సమస్యలు తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీ మేరకు వారికి భరోసా కల్పించారు. జూనియర్ న్యాయవాదులను ప్రోత్సహిస్తూ వారు వృత్తిలో స్థిరపడేలా వైఎస్సార్ లా నేస్తం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందులో భాగంగా అర్హులైన జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ. 5 వేలు చొప్పున్న ఫిబ్రవరి 2023 నుంచి జూన్ 2023 వరకూ వారి బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేశారు.

ఆర్థిక తోడ్పాటు

నందికొట్కూరు కోర్టు పరిధిలో ఐదుగురు, ఆత్మకూరు కోర్టు పరిధిలో ఐదుగురికి లా నేస్తం పథకం ద్వారా రూ.25వేలు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. న్యాయవాద పట్టా చేతపట్టి కళాశాల నుంచి బయటకు వచ్చిన యువ న్యాయవాదులు వృత్తి ఆరంభంలో కక్షిదారుల నుంచి కేసులు రాక అనేక ఒడిదొడుకులకు లోనవుతూ ఉంటారు. దీంతో కొందరు వత్తిని వదిలి వెళ్లే పరిస్థితి. ఈ పరిస్థితుల్ని తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జూనియర్ న్యాయవాదులకు వృత్తిపై ఆసక్తి పెంచేలా వారికి నెలకు రూ, 5 వేలు స్టైఫండ్‌గా అందించి చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. దీనికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే హామీని నెరవేర్చేందుకు చర్యలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్ వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టి అర్హులైన యువ న్యాయవాదులకు మూడేళ్లపాటు నెలకు రూ. 5 వేలు చొప్పున ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్నారు.

కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా



పట్టా చేతపట్టి న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన జూనియర్ న్యాయవాదులు తొలినాళ్లలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటారు. న్యాయవాద వృత్తి ప్రారంభించిన లాయర్లు లైబ్రరీ, రవాణా, ఇతర అవసరాలకు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా యువ న్యాయవాదులకు ప్రభుత్వం లా నేస్తం ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుంది.

– వెంకటరాముడు, బార్ అసోసియేషన్ సభ్యులు, నందికొట్కూరు

వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఉపయుక్తం



జూనియర్ న్యాయవాదుల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని లా నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి నెల రూ, 5 వేలు స్టైఫండ్ చెల్లిస్తుండడంతో రాష్ట్రంలో వేల మంది జూనియర్ లాయర్లు ప్రయోజనం పొందుతున్నారు. నూతనంగా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన మాకు కొంత ఆర్థిక పరిపుష్టి కలగడంతో ఇతర వృత్తుల వైపు వెళ్లకుండా నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

– అరుణ్‌కుమార్ రెడ్డి, యువ న్యాయవాది, నందికొట్కూరు కోర్టు

జూనియర్లకు ప్రోత్సాహం



జూనియర్ న్యాయవాదులుగా వృత్తిపరంగా ఎదురయ్యే చిన్న చిన్న ఆర్థిక సమస్యలకు తట్టుకునేందుకు వైఎస్సార్ లా నేస్తం కింద నాకు ఆర్థిక సాయం అందుతుంది. ఇది అన్ని వర్గాలకు చెందిన న్యాయవాదులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ప్రాతకోట భాస్కర్, న్యాయవాది, ఆత్మకూరు కోర్టు

బొల్లవరంలో ప్రశాంతంగా మొహర్రం

మహానంది: బొల్లవరం గ్రామంలో మొహర్రం వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. సమస్యాత్మక గ్రామమైన బొల్లవరంలో పోలీసు బందోబస్తు మధ్య ఆదివారం ముగింపు వేడుకలు నిర్వహించారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఏఎస్ఐ రామకృష్ణుడు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. సోమవారం గాజులపల్లెలో మౌలాలిస్వామి జార్తలు నిర్వహించనున్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడే


లింగాలలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

నందికొట్కూరు: గురుపౌర్ణమికి ఆరాధ్యుడు శ్రీకృష్ణుడేనని త్రైత సిద్ధాంత ఇందూ జ్ఞాన వేదిక ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు మునిదాసు అన్నారు. ఆదివారం పాములపాడు మండల పరిధిలోని లింగాల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భగవద్గీత బోధించిన శ్రీకృష్ణుడు జగద్గురువేనన్నారు. సేవా సమితి సభ్యులు భాస్కర్, వెంకటేష్, ప్రకాష్, నాగన్న, హరిత తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మకు బోనాల సమర్పణ


బోనాలు తీసుకువస్తున్న ఈఓ, అర్చకులు, ఆలయాధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రంలోని గ్రామదేవత అంకాలమ్మకు మూలనక్షత్రం పురస్కరించుకుని ఆదివారం దేవస్థానం తరపున బోనాలను సమర్పించారు. ఈఓ ఎస్ లవన్న, స్వామివారి ప్రధానార్చకులు శివప్రసాద్‌స్వామి, అమ్మవారి ఆలయప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఐఎన్‌వీ మోహన్, అర్చకులు, వేదపండితులు నూతన వస్త్రాలను, పసుపు కుంకుమ, గాజులు, ఫలపుష్పాదులు సమర్పించి, అమ్మవారి విశేషపూజలు నిర్వహించారు. సంకల్పాన్ని పఠించి, బోనాలను సమర్పించారు. కాగా అంకాళమ్మ అమ్మవారికి దేవస్థానం తరపున బోనాలు సమర్పించడం ఇదే మొట్టమొదటిసారి. ఇకపై ప్రతి సంవత్సరం దేవస్థానం తరపున అంకాలమ్మకు బోనం సమర్పించడం జరుగుతుందని ఈఓ తెలిపారు.

రాయలసీమ ప్రాజెక్టులను అడ్డుకోవడమే చంద్రబాబు నైజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి

కొత్తపల్లి: రాయలసీమ ప్రాజెక్టును అడ్డుకోవడమే చంద్రబాబు నైజమని, అందుకే ప్రాజెక్టుల సందర్శనకు పూనుకున్నారని నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి విమర్శించారు. ఆదివారం ఆయన కుటుంబ సమేతంగా శివపురం సమీపంలోని కొలనుభారతిదేవి అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించుకున్నారు. అలాగే సప్తశివాలయాలను సందర్శించి ప్రత్యేకపూజలు చేసుకున్నారు. అనంతరం ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయం దండగన్న చంద్రబాబు రాయలసీమ ప్రాంతంలోని పలు ప్రాజెక్టులను సందర్శించాలనుకోవడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు ప్రాజెక్టుల సందర్శన రాజకీయ లబ్ధి కోసమేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ శివన్న, కో–ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్


గెలుపొందిన జట్లతో అతిథులు, పూర్వ విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాలను నిర్మించి 60 వసంతాలు పూర్తయిన సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సున్నిపెంటలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఆదివారం టోర్నమెంట్ ముగియడంతో గెలుపొందిన జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. శ్రీశైలం మండలంలోని శ్రీశైలం, సున్నిపెంట, తెలంగాణ సరిహద్దు గ్రామాలైన ఈగలపెంట, దోమల పెంట, తదితర ప్రాంతాల నుంచి 28 జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. మొదటి బహుమతిని సున్నిపెంటకు చెందిన ఫ్రెండ్స్ టీమ్, రెండో బహుమతిని శ్రీశైలానికి చెందిన శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామి టీమ్ గెలుపొందింది. మొదటి బహుమతి నగదు రూ.20,116లు, కప్, రెండవ బహుమతిని రూ.10,116, కప్ ను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌రెడ్డి, స్పెషల్ ప్రొటెక్షన్‌ఫోర్స్ ఆర్ఐ రమణ, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు భరత్‌రెడ్డి, పూర్వ విద్యార్థి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మగ్బూల్‌హుస్సేన్ పాల్గొన్నారు.

వృద్ధులు దైవంతో సమానం


వృద్ధులను సన్మానిస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): వృద్ధులు దైవంతో సమానమని, కుటుంబ సభ్యులు వారిని నిర్లక్ష్యం చేయకుండా సేవ చేసి భావి తరాలకు ఆదర్శంగా నిలవాలని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఆదివారం శ్రీకాళీ మాత సేవా సమాజం ఆధ్వర్యంలో 80 సంవత్సరాలు దాటిన వృద్ధుల ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై వృద్ధులను ఘనంగా సన్మానించి మాట్లాడారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించి పోవడంతో మానవతా విలువలు కూడా నశించిపోయాయని, ఈ తరుణంలో వృద్ధ తల్లిదండ్రుల సంక్షేమం కోసం శ్రీకాళీ మాతా సమాజం వారు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వృద్ధులు పురాతన గ్రంథాలయంతో సమానమని వారి అనుభవాలను నేటి తరం వారు తెలుసుకోవాలని చెప్పారు. డాక్టర్ మధుసూదనరావు , క్రిటియేటివిటీ కృష్ణ తదితరులతో కలిసి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 200 మంది వృద్ధులను ఘనంగా సన్మానించారు. సమాజ్ ఆరవేటి వాసు, విజయ్ కుమార్, రాంప్రసాద్, డాక్టర్ దస్తగిరిరెడ్డి, వైద్యులు సహదేవుడు, ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలి రండి

కొత్తపల్లి: సీపీఐ జిల్లా మొదటి మహాసభలు ఆత్మకూరు పట్టణంలో జరుగుతున్న సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు, కార్మికులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటశివుడు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా విభజన తర్వాత మొట్టమొదటి మహాసభ ఆత్మకూరు పట్టణంలో జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యవసాయ కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ జిల్లా మహాసభలను కార్మికులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు భీమలింగం, సురేష్, బాలకృష్ణ, బాలు తదితరులు పాల్గొన్నారు

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

ఆత్మకూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్‌టీయూ నూతన అధ్యక్షుడు ప్రదీప్‌కుమార్, కలిముల్లా అన్నారు. పట్టణంలోని పీఆర్‌టీయూ కార్యాలయంలో ఆత్మకూరు, కొత్తపల్లి మండలాలకు చెందిన సంఘం నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఆత్మకూరు మండల కార్యవర్గం కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఖాజామొద్దీన్, ఉపాధ్యక్షుడిగా హుస్సేన్, మహిళా ఉపాధ్యక్షులుగా శోభ ఎన్నికయ్యారు. కొత్తపల్లి మండల అధ్యక్షుడిగా కలిముల్లా, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, రఫిక్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, సలీం, రుక్మిణి, తదితరులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు .

సచివాలయాల్లో 'స్పందన' నిర్వహించాలి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఎంపీడీవో శోభారాణి తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5వరకు స్పందన నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది ఎవరైనా అర్జీలను స్వీకరించకపోతే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

నంద్యాల(న్యూటౌన్): హేతుబద్ధీకరణ ద్వారా జరిగిన బదిలీలు, పదోన్నతులు పొందిన 60వేల మంది ఉపాధ్యాయులకు జూన్, జూలైకు సంబంధించిన జీతాలను తక్షణమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాధవస్వామి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ కమిషనర్ బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ వివరాలను డైరెక్ట్ ట్రెజరీకి పంపించి త్వరగా జీతాలు ఇవ్వాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, సరెండర్ బిల్లు తదితర వాటిని వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణం


బదిలీపై వెళ్తున్న సీఐ సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగికి బదిలీ సాధారణమని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న సీఐ సుబ్రహ్మణ్యంను ఆదివారం రాత్రి ఆత్మకూరు పోలీసులు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ అందరి ప్రశంసలు పొంది, కింది ఉద్యోగులకు పూర్తి సహకారం అందించడం గొప్ప విషయం అన్నారు. అనంతరం పలువురు పోలీస్ సిబ్బంది దుశ్శాలువా, పూలమాలలతో బదిలీపై వెళ్తున్న సీఐను సన్మానించారు. కార్యక్రమంలో నందికొట్కూరు సీఐ విజయభాస్కర్, ఆత్మకూరు ఎస్సైలు కృష్ణమూర్తి, వెంకట నారాయణరెడ్డి, కొత్తపల్లి ఎస్సై హుస్సేన్‌బాషా, వెలుగోడు ఎస్సై జగన్మోహన్‌యాదవ్, సీసీఎస్ ఎస్సై శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు దుర్వినియోగం చేస్తే చర్యలు

మహానంది: శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే విరాళాలు, వస్తువుల విషయంలో సిబ్బంది కొందరు దుర్వినియోగానికి పాల్పడుతున్నారని సమాచారంతో ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి చర్యలకు దిగారు. ఈ క్రమంలో ఆలయంలో పనిచేస్తున్న సిబ్బందికి పలు దిశానిర్దేశాలు చేస్తూ ఆదివారం సర్క్యులర్ జారీ చేశారు. ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కొందరు భక్తులు సమర్పించే కానుకలను ఇళ్లకు తీసుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. భక్తితో భక్తులు సమర్పించే వాటిని ఇళ్లకు తీసుకెళ్లడం ఎంతవరకు సమంజసమని మందలించి వదిలేశారన్నారు. అయితే ఇక నుంచి భక్తులు స్వామివారికి సమర్పించే ప్రతి చిన్న, పెద్ద కానుకలు, వస్తువులేవైనా సరే దేవస్థానానికే చెందాలన్న సదుద్దేశంతో హెచ్చరికలు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రవర్తిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

అమ్మవారికి పల్లకీ సేవ


పల్లకీలో స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు,ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులు గావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకొని రైతులు మల్బరీ సాగులో రాణించాలని హార్టికల్చర్ టెక్నికల్ అధికారి కాశీవిశ్వనాథం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మిడుతూరు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల మండలాల్లో ఇప్పటిదాకా 190 ఎకరాల్లో రైతులు మల్బరీ పంటను సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మరో 50 ఎకరాల్లో సాగును ప్రోత్సహించేలా టార్గెట్లు విధించుకొని రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రస్తుతం అధికంగా వీవన్ మొక్కను రైతులు సాగుచేస్తున్నారని చెప్పారు. ఈ మొక్క ఒకటి రూ.2లు అవుతుందని, ఎకరాకు 5వేల మొక్కలను విత్తుకోవాల్సి ఉంటుందన్నారు. మొక్కలు విత్తుకొనే రైతులకు ప్రభుత్వం ఓబీసీలకు రూ.18,750లు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరాకు రూ.22,500ల రాయితీ మొత్తాన్ని ఇస్తుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న రైతులు ఆత్మకూరు హార్టికల్చర్ కార్యాలయంలో సంప్రదిస్తే పూర్తి వివరాలు తెలియజేస్తారన్నారు.


మిరపనార చుట్టూ కట్టిన చీరలు

చీరకట్టిన 'మిరపనార'

జూపాడుబంగ్లా: చుట్టూ రంగు రంగుల చీరల దొంతరలు.. అటుగా వెళ్లిన వారు ఏంటా అని తలతిప్పి చూడాల్సిందే. సాగుచేసిన పంటను పందులు, పక్షుల బారి నుంచి కాపాడుకునేందుకు పంటల చుట్టూ రైతులు చీరలను కట్టడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో మండలంలోని పి.లింగాపురం క్రాస్ రోడ్డు వద్ద మద్దిలేటి అనే కౌలు రైతు పొలంలో సాగుచేసిన పండుమిరప నారను కాపాడుకునేందుకు చుట్టూ చీరలను కట్టాడు. రెండు ఎకరాల పొలంలో సుమారు రూ.20వేలు వెచ్చించి మిరపనారను సాగుచేశాడు. నర్సరీలో మొక్కలు పెంచుకుంటే అధిక వ్యయం అవుతుందనే ఉద్దేశంతో పొలంలోనే విత్తనాలు చల్లుకున్నాడు. మొలకెత్తిన మిరపనారను పందుల బారి నుంచి కాపాడుకునేందుకు పాత చీరలు తెచ్చి నారచుట్టూ కట్టాడు. అటుగా దారివెంట వెళ్లే ప్రయాణికులకు, బాటసారులు ఈ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.


మండ్లెం సమీపంలో పొలంలో కలుపును తొలగిస్తున్న వ్యవసాయ కూలీలు

వ్యవసాయ పనుల్లో రైతన్నలు బిజీ

- ఎడతెరిపిలేని వర్షాలకు విత్తుకు అనువుగా మారిన పొలాలు
- పత్తి, పండు మిరపై రైతుల ఆసక్తి
- ఆర్బీకేల్లో అందుబాటులో ఎరువులు


80బన్నూరు సమీపంలో పత్తి విత్తుతున్న వ్యవసాయ కూలీలు


తాటిపాడు సమీపంలో సోయాబీన్ విత్తనాలు వేస్తున్న రైతులు

జూపాడుబంగ్లా: ఖరీఫ్ ప్రారంభంలో ఆశించిన వర్షాలు కురవకపోవడంతో 60శాతం మంది రైతులు మాత్రమే విత్తనాలు వేసున్నారు. వారం క్రితం నుంచి ఎడతెరపిలేకుండా కురిసిన వర్షాలకు విత్తనాల సాగుకు పొలాలు అనువుగా మారడంతో మిగతా రైతులు ముమ్మరంగా మొక్కజొన్న, మిరప, సోయాబీన్, పత్తి విత్తనాలను సాగుచేసుకుంటున్నారు. ముందస్తుగా పంటలు సాగుచేసిన రైతులు పొలాల్లో కలుపు తీయించుకోవటంతో పాటు పంటలకు రసాయనిక ఎరువులు వేసుకుంటున్నారు. మండలం వ్యాప్తంగా ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 10,022 హెక్టార్లు కాగా ఇప్పటిదాకా 6,350 హెక్టార్లలో పంటలు సాగుచేశారు. నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా 50,758 హెక్టార్ల సాధారణ సాగు విస్తీర్ణం ఉండగా ఇప్పటిదాకా 35,452 హెక్టార్లలో పంటలు సాగుచేసినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పత్తి, పండు మిరప పంటలకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు అధికంగా సాగుచేశారు. పారుమంచాల, తంగడంచ, తూడిచెర్ల, పి.లింగాపురం, తరిగోపుల గ్రామాల్లో వర్షాధారం కింద కంది పంటను రైతులు సాగుచేస్తున్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులను గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

గిరిజనులను దెబ్బతీసేందుకు కుట్ర

గడివేముల: దేశంలో గిరిజనులకు దెబ్బతీసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మండిపడ్డారు. ఆదివారం మండల పరిధిలోని ఎల్ కే తండా గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం వల్ల ఆదివాసీ గిరిజనులకు ఒరిగిందేమి లేదన్నారు. ఆదిమజాతి (పీవీటీజీ) గిరిజనులకు ప్రత్యేక కేంద్ర ప్రభుత్వ పథకాలు ఉన్నా ఏ ఒక్కరికి అందడం లేదని విమర్శించారు. ఆదివాసీ ప్రజలకు అడవిపై ఉన్న హక్కులను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఇప్పటికే నిత్యావసర సరకులు ధరలు పెరిగాయని, గిరిజన వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు సక్రమంగా లేవన్నారు. దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.

కార్మికులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యుత్ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా కాంట్రాక్టు కార్మికులు 24వేల మంది పనిచేస్తున్నారని విద్యుత్ శాఖలో విలీనం చేసి న్యాయం చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. రఘురామమూర్తి, బాలవెంకట్, శ్రీరాములు పాల్గొన్నారు.